నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి 1

శుక్రవారం 28 ఏప్రిల్ 2023

పెండింగ్ చాలన్లు క్లియర్ చేయాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎల్లారెడ్డి ఎస్ఐ గణేష్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వాహనం నడుపుతున్న సమయంలో హెల్మెట్ ధరించాలని, త్రిపుల్ రైడింగ్ చేయవద్దని, మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై జరిమానా విధిస్తామని అన్నారు. వాహనాలపై పెండింగ్ చాలాన్లు ఉంటే వెంటనే వాటిని క్లియర్ చేసుకోవాలని, లేని పక్షంలో వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

సీఎం సహాయనిధి.. పేదలకు వరం..

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా మారిందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని 31 మంది లబ్దిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను తన నివాసంలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి బుధవారం రాత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడే పేద ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాపసింగ్, అంకోల్ సాయన్న, ఎంపీటీసీ కుమ్మరి నారాయణ, మాజీసర్పంచ్ నారాగౌడ్, మోహన్ తదితరులున్నారు.

బీజేపీ పాలనలో
మహిళలకు రక్షణ లేదు

- **ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ బ్రిజ్ బూషన్ శరన్ సింగ్ దిష్టిబొమ్మ దహనం**

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేదని ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో డీవైఎఫ్ఐ, సీఐటీయూ, ఏఐఏడబ్ల్యు, ఏఐకేఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ బ్రిజ్ బూషన్ శరన్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు పెద్ది వెంకట్‌రాములు, నూర్జహాన్, పెద్ది సూరి, పల్లపు వెంకటేష్, మాట్లాడారు. ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు అయిన బ్రిజ్ బూషన్ శరన్ సింగ్ గత కొంతకాలంగా భారత మహిళా రెజ్లర్‌లను లైంగికంగా వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తూ కేంద్ర ప్రభుత్వం అండతో రక్షించబడుతున్నారని తెలిపారు. బీజేపీ పాలనలో పేద మధ్యతరగతి బడుగు బలహీన అట్టడుగు సామాజికంగా వెనుకబడిన వర్గాల మహిళలకు రక్షణ లేదని అనుకున్నామని, కానీ నేడు మన దేశానికి రెజ్లింగ్ ప్రపంచ ఛాంపియన్షిప్‌లో స్వర్ణ పథకాన్ని తీసుకువచ్చి ప్రపంచ చిత్రపటంలో భారత కీర్తిని చాటిన మహిళా రెజ్లర్లకు సైతం బీజేపీ పాలనలో రక్షణ లేదని ఈ ఘటనతో రుజువైందని అన్నారు.

ఇదేనా బేటీ బచావో బేటి పడావో అంటే అని ప్రశ్నించారు. గత నాలుగు రోజులుగా ఢిల్లీ కేంద్రంలోని జంతర్మంతర్ వద్ద తమకు న్యాయం చేయాలని దీక్ష చేస్తున్న మహిళా రెజ్లర్లకు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం సిగ్గుచేటని అన్నారు. తక్షణమే ఈ కీచకుడిని అన్ని పదవులు నుంచి తొలగించి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని జైలుకు పంపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మాల్యాల గోవర్ధన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యేశాల గంగాధర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి మహేష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేష్, సిఐటియు జిల్లా నాయకులు నన్నెసాబ్, ప్రజాసంఘాల నాయకులు ఆశీర్వాదం, కిరణ్ చారి, సాయినాథ్, శేఖర్, కిరణ్, శైలజ, విశాల్, భీమశంకర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖైదీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- **ప్రతి రెవెన్యూ డివిజన్‌లో పెట్రోల్ బంకు ఏర్పాటు**
- **జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్**

నవతెలంగాణ-బోధన్

జైళ్ల శాఖ ద్వారా ఖైదీలలో మార్పులు తీసుకువచ్చి వారికి కుటుంబ పోషణకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని ఆ శాఖ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం బోధన్ పట్టణ సమీపంలోని మర్రి మైసమ్మ ఆలయ సమీపంలో గల ఖైదీల ఆధ్వర్యంలో నిర్వహించబడే పెట్రోల్ బంకును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టుకతో ఎవరూ నేరస్తులు కారని సమాజంలోని సంఘటనలే కొంతమందిని నేరస్తులుగా మారుస్తాయని అన్నారు. క్షణికావేశంలో నేరాలు చేసి జైలు పాలైన వారిలో మానసిక పరివర్తన మార్పులు తీసుకువచ్చి మరోసారి నేరాలు చేయకుండా జైలు అధికారులు వారిని మారుస్తారని, అలా సత్ప్రవర్తనతో విడుదలైన ఖైదీలచే పెట్రోల్ బంకులు నిర్వహించి ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జైలు నుంచి విడుదలైన ఖైదీలు తమకు పని కావాలని తమను సంప్రదిస్తే వారికి తప్పకుండా ఉపాధి కల్పిస్తామన్నారు. నేరరహిత సమాజం కోసం ఈ మార్పును తీసుకువస్తున్నట్టు తెలిపారు. జైళ్లపై సమాజంలో ఒక దురభిప్రాయం ఉందని అలాంటివి ఉండరాదన్నారు. నేరస్తులపై సమాజం చిన్నచూపు చూస్తుందని వారిలో మార్పు తేవడానికి అవకాశం ఇస్తే వారు తప్పకుండా మారుతారని పేర్కొన్నారు. 2012 సంవత్సరంలో జైళ్ల శాఖ ద్వారా ప్రారంభమైన పెట్రోల్ బంకుల నిర్వహణ ఇప్పటివరకు రాష్ట్రంలో 29 పెట్రోల్ బంకులను ప్రారంభించినట్టు తెలిపారు. ఖైదీల ద్వారా నిర్వహించే ఈ పెట్రోలు బంకులలో నాణ్యత, పరిమాణం వందశాతం ఉంటుందని అన్నారు. రాబోయే కాలంలో ప్రతి రెవెన్యూ డివిజన్ పరిధిలో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులను ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జైలు డిపార్ట్మెంట్ అధికారులు ఖైదీలను సక్రమంగా చూసుకుంటూ నైపుణ్యత కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. దీని వెనుక జైళ్ళ శాఖ కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. ఈ పెట్రోల్ బంకు వ్యాపారం నిర్వహణలో ఖైదీలలో మానసిక పరిపక్వత వస్తుందని తెలిపారు. కుటుంబ పోషణకు వారికి మంచి మార్గం అన్నారు. ఖైదీలు కష్టపడి పనిచేసి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం వారు పలు వాహనాలలో ఇంధనం పోసి పెట్రోల్ బంకును ప్రారంభించారు. కార్యక్రమంలో నిజామాబాద్ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ప్రమోద్, జైలర్ రాజశేఖర్‌రెడ్డి, బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్, పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, భారత్ పెట్రోలియం మేనేజర్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాహనంలో ఇంధనం పోస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఐజీ శ్రీనివాస్

29న జవహార్ నవోదయ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-తాడ్వాయి

ఈ నెల 29న జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం జిల్లాలోని 14 కేంద్రాలలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లు, బాల్ పాయింట్ పెన్ను, హాల్ టికెట్‌లో సూచించిన నిబంధనల ప్రకారంగా తమ పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకోవాలని ఆయన సూచించారు.

మహిళా సంఘ సభ్యులకు స్వయం ఉపాధి కోసం రుణం మంజూరు

నవతెలంగాణ-బోధన్

ఐకేపీ ద్వారా నలుగురు మహిళా సంఘం సభ్యులకు స్వయం ఉపాధి కొరకు వ్యక్తిగత రుణములలో భాగంగా పిండి గిర్ని, సేమియా మిషన్, మురుకులు ప్యాకింగ్ మిషన్ మంజూరు చేసినట్టు ఐకేపీ ఏపీఎం వినోద్ కుమార్ తెలిపారు. గురువారం మండల మహిళా సమాఖ్య భవనంలో సమాఖ్య సమావేశంలో ఆయన వెల్లడించారు. పీఎంఎఫ్ ఎంఈ ద్వారా నలుగురు లబ్దిదారులకు ప్యాకింగ్ మిషనరీ కోసం 2 పిండి గిర్నిలు, 1 సెమియా మిషన్, 1 బొంగులు మురుకుల ప్యాకింగ్ మిషన్ మంజూరి చేసినట్టు వివరించారు. ఈ వారంలో బ్యాంక్ నుంచి సబ్సిడీ కింద ఇప్పించనున్నట్టు తెలిపారు. వారికి 35శాతం సబ్సిడీ కింద 10 లక్షల వరకు రుణం, వ్యక్తిగత సభ్యురాలు బిజినెస్ పెట్టుకోవచ్చన్నారు. చిన్న సంఘాల లైవ్ మీటింగ్, గ్రామ సంఘాల లైవ్ మీటింగ్, గ్రేడింగ్ పై సమీక్ష చేశారు. స్త్రీనిధి, న్యూ ఎంటర్ ప్రైజేష్‌పై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి, ఖైరున్నీసా, పోషకళ, సీసీలు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో అక్రమ ఇంటి నిర్మాణం కూల్చివేత

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని సర్వేనెంబర్ 199లో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు జేసీబీతో గురువారం కూల్చివేశారు. ఈ ఘటనపై మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. పురపాలక సంఘం పరిధిలో గల అనిల్ టాకీస్ రోడ్‌లో గంగుల జీవన్ అనే వ్యక్తి నిర్మిస్తున్న ఇంటిపై సీసీ నెం.501/2023, తేదీ ప్రకారం 24.04.2023 హైకోర్టు ఆదేశాల మేరకు ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసినట్టు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. గంగుల జీవన్, ఖాజా సలాహుద్దీన్ ఇద్దరి మధ్య స్థలం విషయంలో హైకోర్టులో కేసు విచారణలో భాగంగా గంగుల జీవన్ సర్వే నెం.199 నిర్మిస్తున్న ఇల్లు ఖాజా సలహుద్దీన్‌కు చెందిన స్థలంలో నిర్మించినట్టు కోర్టు నిర్ధారించింది. దాంతో గురువారం హైకోర్ట్ ఆదేశాల మేరకు సర్వే డిపార్ట్మెంట్ అధికారులు సర్వే చేసి ఆ స్థలం సర్వే నెం.199లో నిర్ధారణ అయినందున నిర్మించిన ఇంటిని కూల్చివేసినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం లీడర్ తహసీల్దార్ వర ప్రసాద్, టీం సభ్యులు మున్సిపల్ కమిషనర్, ఏపీఓ శ్రీనివాస్, టీపీఓ ఆంజనేయులు, సీఐ ప్రేమ్‌కుమార్ సమక్షంలో అక్రమ నిర్మాణం కూల్చివేశారు.

ఎల్లారెడ్డి ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నం చేసినా యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ గణేష్ తెలిపారు. ఎస్ఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం సబ్దళ్‌పూర్ గ్రామానికి చెందిన వ్యక్తి బుధవారం రాత్రి సుమారు 11గంటల 40 నిమిషాల సమయంలో ఏటీఎం పగలకొట్టడానికి ప్రయత్నించాడని అలారం మొగడంతో పక్కన ఎస్‌బీఐ సిబ్బంది గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా రాత్రి సీసీ కెమెరాలు పరిశీలించి వ్యక్తిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నవతెలంగాణ-తాడ్వాయి

పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ ఆంజనేయులు సిబ్బందితో వాహనాల తనిఖీలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తుండగా మద్యం త్రాగి వాహనం నడిపిన ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి, సందీప్‌కు కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ 4 రోజుల జైలు, రూ.400 జరిమానా విధించినట్టు ఆయన తెలిపారు.

8 వేల ఎకరాల పంట నష్టం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

వడగండ్ల వానతో బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ మండలాల్లో 8వేల ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లినట్టు బాన్సువాడ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. గురువారం బాన్సువాడ డివిజన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నసురుల్లాబాద్ మండలంలో 141 ఎకరాలు, బీర్కూర్ మండలంలో 70 ఎకరాలు, బాన్సువాడ మండలంలో 8వేల ఎకరాల వరి పంట నష్టం జరిగినట్టు తెలిపారు. మంగళవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వానకు కోతదశలో ఉన్న వరిపైరుకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పొలాల్లోని పైరు గింజలేకుండా నేలరాలిందని, నేటి నుంచి గ్రామాలవారీగా పంట నష్టం వివరాలు సేకరిస్తామన్నారు.

గ్యాంగ్‌స్టర్ అవ్వాలని కటకటాల్లోకి..

- **యువకుడి హత్య కేసు చేధించిన పోలీసులు**
- **ప్రధాన నిందితుల అరెస్టు**

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ నగరంలోని బాబన్‌సాహెబ్ పహాడ్‌లో జరిగిన యువకుడు అర్బాజ్ హత్య కేసును పోలీసులు చేధించారు. రాజీ కోసం పిలిచి కత్తులతో దాడి చేసి హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. డాన్ అవ్వాలని గ్యాంగ్‌లను వెనకేసుకుని తిరుగుతున్న నిందితుడు ఈ హత్యకు పాల్పడినట్టు పోలీసులు ధ్రువీకరించారు. ఈ హత్యలో ఏ1గా మీర్జా సోహెల్ బేగ్, ఏ2 సర్ఫరాజ్‌ఖాన్, ఏ3 సయ్యద్ హుస్సేన్, ఏ4 సయ్యద్ ఖాజాపాషా, ఏ5 సజీద్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. న్యాయస్థానం నిందితులకు రిమాండ్ విధించింది. మిగిలిన వారి కోసం పోలీసులు గాలింపు చేపడుతున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బాబన్‌సాహెబ్ పహాడ్‌కు చెందిన మీర్జా సోహెల్ బేగ్ తన ఏరియాలో డాన్ మాదిరి కావాలని తనతో పాటుగా కొంత మందిని వెనుక గ్యాంగ్ లాగ తిప్పుకునేవాడు. ప్రజల్లో అతనంటే ఒక రకమైన భయం ఉండాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్‌లో మూడు కత్తులు కొన్నాడు. ఎవరైనా తనతో గొడవ పెట్టుకుంటే ఆ కత్తిని చూపించి భయపెట్టేవాడు. అవసరమైతే చంపైన సరే ఫేమస్ కావాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు మృతుడు అర్బాజ్ స్నేహితుడు అఫ్జల్ ఒక కారును తీసుకుని తన స్నేహితులతో వెళ్తున్నాడు. అయితే అసద్‌బాబానగర్ చౌరస్తా దగ్గర రోడ్‌పై ఉన్న బురదనీరు ఆ పక్కనే వెళ్తున్న ఏ-9 హాజీ మీద పడింది. ఈ విషయంలో అఫ్జల్‌ను 23వ తేదీన ఇద్రిస్‌ఖాన్ వెంచర్ వద్దకు రాజీకి పిలిచారు. కారు డ్రైవింగ్ వల్ల తన కాలిగి గాయం అయ్యిందని, రూ.50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ రాజీకి అఫ్జల్‌తో పాటు అతని స్నేహితులు మృతుడు(అర్బాజ్), అజార్, పర్వేజ్, అజీం తదితరులు కలిసి వెళ్లారు. అయితే నిందితులు ఏ1 నుంచి ఏ10 వరకు అఫ్జల్ అతని స్నేహితులతో ఘర్షణకు దిగారు. ఈ సమయంలో మృతుడు అర్బాజ్ ప్రధాన నిందితుడు ఏ-1 మీర్జా సోహెల్ బేగ్ తన వద్ద ఉన్న కత్తితో కడుపులో పొడిచినట్టు తెలిపారు. ఇక మిగిలిన నిందితులు సైతం తమ వెంట తెచ్చుకున్న కత్తులతో దాడులకు పాల్పడ్డారు. ఏ-3 సయ్యద్ హుస్సేన్ తన వద్ద ఉన్న కత్తితో అజార్‌ను చెంపపైన పొడిచాడు. అయితే అజార్ అక్కడి నుండి తప్పించుకుని పారిపోయాడు. మృతుడు అక్కడే రక్తపు మడుగులో కిందపడిపోయాడు. ఈ ఘటన తరువాత నిందితులు పది మంది అక్కడి నుంచి ఆటోలో పారిపోయాడు. అది చూసిన చుట్టుపక్కలవారు మృతుడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే కత్తిపోటు గాయాలతో చనిపోయినట్టు నిర్ధారించినట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న నార్త్ రూరల్ సీఐ నరహరి ప్రధాన నిందితులు ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులను బుధవారం నాగారంలోని డబల్‌బెడ్‌రూం అపార్ట్‌మెంట్ బిల్డింగ్ నెంబర్ 13లో అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం పోలీసులు గాలింపు చేపడుతున్నారు. నిందితులకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. కేసు చేధించడంలో కృషి చేసిన ఐదోటౌన్ ఎస్సై డి సాయినాథ్, రమేష్, సత్యానందం, కోటి, విజయ్, గంగాధర్, ఆనంద్, శంకర్ రావు, ప్రదీప్, రాజులను ఏసీపీ అభినందించినారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు


లిఫ్ట్ మిల్లర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- **బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్**

నవతెలంగాణ-కామారెడ్డి

లిఫ్ట్ మిల్లర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో లిఫ్ట్ మిల్లర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి బిల్డింగ్ వర్కర్స్ అదర్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా సుమారుగా 8 మండలాల పరిధిలో లిఫ్ట్ మిల్లర్లు 150 పైగా ఉన్నాయని, ఒక్కొక్క బిల్డర్ కింద సుమారుగా 20 నుంచి 30 మంది కార్మికుల పని చేస్తున్నారని, అలాంటి కార్మికులు మిల్లర్ చార్జీలు పెంచినందుకు స్లాబ్ రేటు1 పీటుకు ఆరు రూపాయలు ఉన్న రేటును ఏడు రూపాయలు అంటే ఒక్క రూపాయి పెంచినందుకు కామారెడ్డిలో ఉన్న కొంతమంది బిల్డర్స్ అసోసియేషన్‌గా కొత్తగా సంఘంగా ఏర్పడి మిల్లర్లను పక్కకు పెట్టి ఉత్తరప్రదేశ్ నుంచి మహారాష్ట్ర నుంచి మిల్లర్లను తీసుకొస్తామని వారిచే పనిచేయించుకుంటామని బెదిరిస్తున్నారని తెలిపారు. కొంతమంది బిల్డర్లు వారి కొత్త సంఘాన్ని సృష్టించుకున్నారని వివరించారు.

దీనితో సుమారుగా 4000 బిల్డింగ్ వర్కర్స్‌కు మిల్లర్ కార్మికులకు పొట్ట గొడుతున్నారని, కావున కామారెడ్డిలో ఉన్న బిల్డర్లు అలాంటి ప్రయత్నాలు చేయొద్దని లేదా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విడగొట్టి సాయిలు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, శ్రీను, లిఫ్ట్ మిల్లర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఉస్మాన్, అధ్యక్షులు సుదర్శన్, ఉపాధ్యక్షులు చంద్రం, ప్రధాన కార్యదర్శి బాలనర్సు, ప్రభాకర్, రాజు, రమేష్, మధు, భూమయ్య, చంద్రం, లింగం తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

కామారెడ్డి 'ఆక్వా' జిల్లాగా అభివృద్ధి చెందాలి

- **కలెక్టర్ జితేష్ వి పాటిల్**

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి 'ఆక్వా' జిల్లాగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం మండలంలోని ఈదులయ గంగాధర్ పొలంలో ఏర్పాటు చేసిన చేపల పెంపకం వద్ద శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా అంటే ఆక్వా జిల్లాగా పేరు తేవాలని డ్వాక్రా సంఘం మహిళలకు సూచించారు. కామారెడ్డి జిల్లాకు చేపల పెంపకంలో దేశంలో గుర్తింపు తేవాలని సూచించారు. ఒకటి రెండు గుంటలలోనే చేపల పెంపకం చేయాలని అన్నారు. దీనితో పాటు పశుపోషణ, బయోగ్యాస్, సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. చేపలను పెంచేటప్పుడు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం నగేష్, ఎంపీపీ గైని అనుసూయ, ఏఎంసీ చైర్మన్ పుల్లం సాయిరెడ్డి, రైతు సమితి సంఘం అధ్యక్షుడు ఏలేటి భూంరెడ్డి, ఎ.పి.యం.రాజిరెడ్డి. ఎ.ఎం.సి.వైఎస్ చైర్మన్ రాజేందర్, సి.సిలు డ్వాక్రా సంఘం మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

- **సీపీఐ డిమాండ్**

నవతెలంగాణ-లింగంపేట్

వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. గురువారం మండల కేంద్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఇంటింటికీ సీపీఐలో భాగంగా జాతీయ కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఆటోజాత ఎల్లారెడ్డి, లింగంపేట్‌లో కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఎల్లారెడ్డి, లింగంపేట్ కేంద్రాల్లో రైతుల ధాన్యం తడిసిపోయిందని ఆ రైతులను ఆదుకోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెరిగిన ధరలు తగ్గించాలని, పెట్రోల్ గ్యాస్ ధరలను, నిత్యావసర ధరలు, ఎల్ఐసీ, రైల్వే బ్యాంకింగ్, రవాణా రంగాన్ని ప్రైవేటీకరణ మానుకోవాలని, పేద ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.బాలరాజ్, నాయకులు దేవయ్య, మల్లేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఆత్మహత్య



నవతెలంగాణ-మాక్లూర్/నిజామాబాద్‌సిటీ

ఆలూరు మండలంలోని కల్లెడ గ్రామంలో మనఊరు మనబడిలో భాగంగా పాఠశాలలో చేసిన బిల్లులు సకాలంలో రావడం లేదని మనస్థాపానికి గురై గురువారం ఉదయం కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాథమిక పాఠశాల చైర్మన్, మనఊరు మనబడి కాంట్రాక్టర్ సూరంగల విజయ్(38) అప్పుల బాధతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య పుష్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించాం : డీఈవో

నిజామాబాద్‌సిటీ : కాంట్రాక్టర్ కు బిల్లు చెల్లించామని డీఈఓ దుర్గా ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాక్లూర్ మండలంలో ఎంపీపీఎస్ కల్లెడ పాఠశాల కాంట్రాక్టర్, మన ఊరు-మన బడి పథకంలో డబ్బులు అందక ఆత్మహత్య చేసుకున్నట్లు మీడియాలో ప్రచారం అవుతుందని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ ఏఈ పంచాయతీరాజ్ విభాగం ఎంఓఎండి, బ్యాంక్ స్టేట్మెంట్ పరిశీలించిన తరువాత ఆ కాంట్రాక్టర్‌కు రూ. 5,70,400 చెల్లించామని పేర్కొన్నారు. ఆయనకు ఎటువంటి బకాయిలు లేవు అని బ్యాంక్ స్టేట్మెంట్ సరిచూశామని, ఎంఓఎంబి డబ్బులు చెల్లించలేదంటున్నది అవాస్తవం, అని ఈ సమాచారాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

ఆయాలు లేని అంగన్వాడీ టీచర్లకు వేసవి సెలవులు వర్తింపచేయాలి

- **సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ డిమాండ్**

నవతెలంగాణ-పిట్లం

అంగన్వాడీ పాఠశాలలలో మే ఒకటో తారీకు నుంచి 30వ తేదీ వరకు టీచర్, ఆయాలకు వంతుల వారీగా ప్రకటించనున్న వేసవి సెలవులలో భాగంగా ఆయాలు లేని అంగన్వాడీ పాఠశాల టీచర్లకు సెలవులు వర్తింప చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ పాఠశాలలలో ఏళ్ల తరబడి ఆయాల టీచర్ల పోస్టులు ఖాళీలు ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ఖాళీల పోస్టులను పూర్తి చేయకుండా ఉదాసీన వైఖరి అవలంబిస్తుందని ఎద్దేవా చేశారు. ఆయాల లేమితో పని భారంతో సతమతమవుతున్న టీచర్లు కొద్దిపాటి వంట పని నిమిత్తం ప్రైవేటు వ్యక్తులకు నెలకు 2, 3వేల రూపాయలు తమ ప్యాకెట్ నుంచి చెల్లిస్తూ కాలమేల్లదీస్తున్న టీచర్లకు వేసవి సెలవులు వర్తింప చేయకపోవడం పుండు మీద కారము చల్లిన విధంగా ప్రభుత్వ వైఖరి అవలంబిస్తుందని ఆరోపించారు. ఆయాలు ఉన్న టీచర్లతో పాటు ఆయాలు లేని టీచర్లకు కూడా సెలవులు వర్తింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తహసీల్దార్ సుధాకర్‌కు బీజేపీ నాయకులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డి మండలంలో అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, కల్లాలలో నిల్వచేసి ఉన్న ధాన్యం తడిసిపోవడంతో వెంటనే నష్ట పరిహారం అందించాలని, తూకం వేసేటపుడు ఎటువంటి తరుగు తీయవద్దని, నష్టపోయిన రైతుల వివరాలు వెంటనే సర్వే చేపించి రైతులకు ఎకరాకు రూ.40,000 పంట నష్టపరిహారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల నాయకులు, సోషల్ మీడియా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి మహనీయుల జయంతి సభ వాయిదా

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏప్రిల్ 28 శుక్రవారం నిర్వహించబడే మహనీయుల జయంతి ఉత్సవాల సభ అనివార్య కారణాల వలన వాయిదా వేసినట్టు ఎంఎస్‌పీ జిల్లా కోఆర్డినేటర్ సురేష్ ప్రకటించారు. గురువారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 28న మహనీయుల జయంతి ఉత్సవాల సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వివరించారు. కానీ పలు అనివార్య కారణాల వలన మందకృష్ణ మాదిగ హాజరు కాలేకపోతున్నారని, కావున ఈ సభను వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. త్వరలో మే మొదటి వారంలో ఈ మహనీయుల జయంతి ఉత్సవాలు యధావిధిగా ఘనంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎంఎస్పీ బోధన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మానికొల్ల గంగాధర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి పానుగంటి భరత్ కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు లక్ష్మీ గారి భూమయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ బోధన్ పట్టణ అధ్యక్షులు తాడేం అబ్బయ్య, ఎమ్మార్పీ సీనియర్ నాయకులు గంధమాల చంద్రయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ మారుతి మాదిగ, మహనీయ ఉత్సవ కమిటీ సభ్యులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిజామాబాద్ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్టీసీ కార్యక్రమం శుక్రవారం 4 నుండి 5 గంటల వరకు నిర్వహిస్తామని ఆర్టిసి రీజినల్ మేనేజర్ ఉషా దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాదు, కామారెడ్డి జిల్లాల ప్రయాణీకులు ఈ సదుపాయం సద్వినియోగము చేసుకోవాలని పేర్కొన్నారు. సమస్యలను సూచనలకు నిజామాబాద్ రీజినల్ మేనేజర్ 9959226011, నిజామాబాద్ డివిజనల్ మేనేజర్ 9959226013, ఆర్మూర్ డిపో మేనేజర్ 9959226019, బోధన్ డిపో మేనేజర్ 9959226001, నిజామాబాద్ -1 డిపో మేనేజర్ 9959226016, నిజామాబాద్ -2 డిపో మేనేజర్ 9959226017, కామారెడ్డి డిపో మేనేజర్ 9959226018, బాన్సువాడ డిపో మేనేజర్ 9959226020 ఫోన్ నెంబర్లకు ఫోన్‌చేయాలని తెలిపారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలోని అర్హత కల్గిన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, (మైనారిటీలతో సహ) అభ్యర్థులకు నాందేవ్ వాడ (ఎస్సీ బాలుర హాస్టల్), తెలంగాణ స్టేట్ స్టడీ సర్కిల్ (టీఎస్ఎస్‌సి నిజామాబాద్), నిజామాబాద్ నందు ఐదు నెలల పాటు ఆర్ఆర్‌బి, బ్యాంకింగ్, యస్‌యస్‌సి అర్హత పోటీ పరీక్షలకోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు డాక్టర్ విజయ కుమార్, హానరీ డైరెక్టర్ టియస్‌యస్‌సి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో చేరడానికి ఈనెల 28నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఎ‌హ్‌.ర్‌బ‌ం‌ఎ‌ఞ‌అతీ‌ఎ‌శ్రీ‌వ.ఏ‌ఔ.ఱఅ వెబ్ సైట్ ద్వారా తేది. 14-05-2023 లోపు రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. మే 21న నిజామాబాద్‌లో ప్రవేశ పరీక్ష జరుగను. పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా 100 అభ్యర్థులు ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్. 9491468799 9951199460 సంప్రదించాలని పేర్కొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్

రాతపరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్షా నిర్వాహకులతో అవగాహన కార్యక్రమం నిర్వహించిన నిజామాబాద్ ఇన్‌ఛార్జి పోలీస్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్
ఈనెల 30న నిర్వహించబోయే కానిస్టేబుల్ పోస్టుల నియామక ఫైనల్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని నిజామాబాద్ ఇంచార్జీ పోలీస్ కమిషనర్ సి.హెచ్. ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం నిజామాబాద్ గిరిరాజు ప్రభుత్వ కాలేజీ, గోల్డెన్ జూబ్లీ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంటు బోర్డు నియమావళి మేరకు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరీక్ష సమయంలో సిబ్బంది, విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలో మొత్తం 5285 మంది అభ్యర్థులు ప్రిలిమినరీ రాత పరీక్షకు హాజరుకానున్నారని చెప్పారు. మొత్తం 12 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయడం జరిగిందని, ఈపరీక్షలు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్లమీద ఫొటో అంటించుకొని పరీక్షా కేంద్రానికి రావాలని బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింటు పెన్ తీసుకొని రావాలని అన్నారు. మిగితా ఎలాంటి గుర్తింపు కార్డులు తీసుకురాకూడదని, అన్నిపరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఫర్నీచర్, గాలి, వెలుతురు, నీటి వసతి ఏర్పాటు చేయాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలకు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. రాత పరీక్షకు హాజరు అయ్యే అభ్యర్థుల గుర్తింపు కొరకు బయోమెట్రిక్ పద్ధతిలో వేలిముద్రలు తీసుకోవడం జరుగుతుందని, ఇందుకు వీలుగా అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందుగానే (ఉదయం 9 గంటలకు) పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 10 గంటల తర్వాత నిమిషం ఆలస్యం అయిన పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను ఒక రోజు ముందుగానే వచ్చి చూసుకోవాలని చెప్పారు.. పరీక్షకు సంబంధించిన నిబంధనలు పూర్తిగా హాల్‌టికెట్లో పొందుపరిచి ఉంటాయని, అభ్యర్థులు ఒకటికి రెండుసార్లు హాల్ టికెట్ లోని నిబంధనలు చదువుకోవడం మరిచిపోవద్దని.. పరీక్షహాలులోకి ఎటువంటి ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులకు అనుమతి ఉండదని, చేతులకు గోరింటాకు, మెహందీ వంటివి పెట్టుకోవడం వలన బయోమెట్రిక్ వేలి ముద్రలు సరిగ్గా వచ్చే అవకాశం ఉండదని, తద్వారా అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉంటుందని అన్నారు. సెల్‌ఫోన్లు, వాచ్‌లు తీసుకురాకూడదని తెలిపారు. బస్టాండ్ వద్ద అభ్యర్థులకు పరీక్షకేంద్రాల రూట్ మ్యాప్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తారని అన్నారు.ఈ రాత పరీక్ష పూర్తిగా రీజినల్ కో-ఆర్డినేటర్ (గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపల్) పి.రామ్ మోహన్ రెడ్డి, నిజామాబాద్ నోడల్ ఆఫీసర్ అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) జి. మధుసుదన్ రావు సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎవరికి ఎలాంటి సందేహాలు ఉన్న వీరి దృష్టికి తీసుకు వచ్చి, వారి సందేహాలు నివృత్తి చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు డిసిపి (ఎ.ఆర్) గిరిరాజు, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఏసీపీలు ఎమ్. కిరణ్ కుమార్, ప్రభాకర్ రావు, కె.ఎమ్. కిరణ్ కుమార్, నారాయణ, అసిస్టెంటు ప్రొఫెసర్ కెమిస్ట్రీ విభాగం డాక్టర్ ఎమ్. సునిత, అదనపు రీజినల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కుమార స్వామి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, పోలీస్ బయోమెట్రిక్ ఆఫీసర్ ఐటి సెల్ ఇంచార్జ్ సిఐ ఎమ్.డి. ముఖీద్ పాషా, ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.


పరీక్షా నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి సీపీ

మాల్ ప్రాక్టీస్‌లో పట్టుబడ్డ ఇద్దరు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
ఓపెన్ ఎస్ఎస్సి ఉర్దూ పరీక్షకు ఉదయం 498 విద్యార్థులకు 457 విద్యార్థులు హాజరయ్యారు. ఓపెన్ ఇంటర్మీడియట్ కెమిస్ట్రీ, పొలిటికల్ సైన్స్ పరీక్షకు 1475 విద్యార్థులకు 1328 విద్యార్థులు హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ కు పాల్పడ్డారని, మధ్యాహ్నం ఓపెన్ ఎస్ఎస్సి హిందీ పరీక్షకు 73 మంది విద్యార్థులకు 65 మంది విద్యార్థులు హాజరయ్యారని డిఇఓ దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

పాటి హనుమాన్ దేవాలయానికి డోలు వితరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రం శివారులోని పాటి హనుమాన్ దేవాలయానికి గ్రామానికి చెందిన కొమ్ముల పద్మ హనుమంతు దంపతులు డోలు(రాజా మేళ తాళం) వితరణ చేశారు. మేరకు గురువారం ఆలయం వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి, దాత నూతనంగా అందజేసిన డోలును ఆలయంలో బిగించారు. హారతి ఇచ్చే సమయంలో ఈ రాజా మేళ తాళాన్ని ఉపయోగించడం జరుగుతుందని పాటి హనుమాన్ భక్త బృందం సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

స్వర్ణామృత ఔషధం పంపిణీ


చిన్నారులకు స్వర్ణామృత ఔషధం వేస్తున్న ఆలయకమిటీ సభ్యులు

నవతెలంగాణ-మోపాల్
మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోగల ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం నర్సింగపల్లిలో స్వర్ణామృత ప్రాశన కార్యక్రమం జరిగిందని ఆలయ ధర్మకర్త శ్రీమాన్ నర్సింహరెడ్డి తెలిపారు. 15ఏండ్ల వరకు వయసుగల పిల్లలకు ఈ ఔషధం ఉచితంగా తొమ్మిది సంవత్సరాల నుండి దాదాపు 3 లక్షల మందికి ఇచ్చామని తెలిపారు. ఈ ఔషధం తీసుకున్న పిల్లల్లో రోగ నిరోదక శక్తి పెరగడంతోపాటు చలాకీగా ఉండడం ధారణ శక్తి, జ్ఞాపకశక్తి అపారంగ పెరగడం చూశామని చెప్పారు. కార్యక్రమంలో నర్సింహ్మా రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమారాచార్యతో పాటు రమేష్, నర్సారెడ్డి, రవీందర్ యాదవ్, నరాల సుధాకర్, నరేందర్, రాములు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ


జెండావావిష్కరించిన నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్:
మండలంలోని మల్లారం గ్రామంలో వైస్ ఎంపీపీ అన్నం సాయిలు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 22 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సదర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన నేడు దేశ అభివృద్ధి కోసం కేసీఆర్ మహాయజ్ఞాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ప్రజల ప్రయోజనాలే ప్రతిపాదికగా మునుముందుకు తీసుకెళ్తున్న కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలుఅని తెలిపారు. వచ్చే ఎలక్షన్లలో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించవలసిన బాధ్యత మనందరి పైన ఉన్నది అని అన్నం సాయిలు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు గాజుల శంకర్ సొసైటీ మాజీ చైర్మన్ బాలరాజు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది అని అన్నారు

మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయి బిల్లులు చెల్లించాలని గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విద్యాశాఖ కమిషనర్ హైదరాబాద్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ లింగయ్య ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ములిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా, పని నుండి దూరం చేసే కుట్ర చేస్తున్నారని అన్నారు. ప్రతి నెల మొదటి వారంలో కార్మికులకు రావాలసిన బిల్లులు చెల్లించాల్సి ఉండగా ఆరు నెలలుగా చెల్లించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మూడు వేల రూపాయల వేతనం మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచుతున్నామని హామీ ఇచ్చిన నేటికీ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న వారికి పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు అమలవుతున్న ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పని భద్రత ఇప్పించాలని, వంట షెడ్లు, వంట పాత్రలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అక్రమ తొలగింపులు మానుకోవాలని, ప్రతినెల హెడ్మాస్టర్లు, ఎంఈఓలు కార్మికులతో జాయింట్ సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన అడిషనల్ డైరెక్టర్ లింగయ్య వాటి పరిష్కారాన్ని కై ప్రభుత్వంతో మాట్లాడతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా కార్యదర్శి టి.చక్రపాణి, జిల్లా ఉపాధ్యక్షులు నాగలక్ష్మి, నాయకులు పెద్దమ్మ, సాయమ్మ, సుమలత, లక్ష్మి, బాలరాజ్, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌పి స్వరాజ పాదయాత్ర బహిరంగ సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ


బహిరంగ సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
ఈనెల 30న జరగబోయే స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభ వాల్‌పోస్టర్ మండలకేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా డిఎస్పి మండల అధ్యక్షులు ఆరేళ్ల మహేష్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లోగల ఇండోర్ స్టేడియంలో భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గంగాసాయిలు మహారాజ్, మండల కోశాధికారి దిలీప్ మహారాజ్, భూమేష్ మహారాజ్, మురళి మహారాజ్, అనిల్ మహారాజ్, రణదీప్ మహారాజ్, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్


వరి పంటలను పరిశీలిస్తున్న బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-ధర్పల్లి
అకాలవర్షంతో పంటనష్టం జరిగిన ప్రతి రైతుకు కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ రైతులకు భరోసా కల్పించారు.గురువారం ఆయన మండలంలోని దుబ్బాక, డీబీతండా, రేకులపల్లి గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ దుబ్బాకలో 560 ఎకరాలు,రేకులపల్లి 230 ఎకరాల పంటను రైతులు ఈ అకాలవర్షానికి నష్టపోయారని అన్నారు. ఏ ఏ పంట ఎంత నష్టం జరిగిందో అధికారులు నివేదిక తయారు చేస్తున్నారని, నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు ధైర్య పడద్దని అన్నారు. అనంతరం దుబ్బాక, రేకులపల్లి, ధర్పల్లి, గోవింద్‌పల్లి గ్రామాల వారికీ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జున్, రైతు బందు మండల అధ్యక్షుడు రాజ్పాల్‌రెడ్డి, పుప్పాల సుభాష్, వాడి గంగారెడ్డి, ఆయాగ్రామాల సర్పంచులు, కోతి శేఖర్ రెడ్డి, పెండ గంగాధర్, గోవర్దన్, నూకల అశోక్, లింబాద్రి, వెంకటేష్, నరేందర్, రాజేందర్, మాలావత్ రాజేష్, ధారావత్ గోపాల్, కొండా శేఖర్, పోత రాజు, రైతులు నాయకులు పాల్గొన్నారు,

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు : ఆర్టీసీ చైర్మన్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్
బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 22 వసంతాలు పూర్తి చేసుకొని 23వ వసంతంలోకి అడుగుతున్న సందర్భంగా ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అలుపెరుగని పోరాటంచేసి ఏకతాటిపై తెలంగాణ ప్రజలను తీసుకువచ్చి ఉక్కు పాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన బాజిరెడ్డి జగన్
తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 22 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే రాబోయే ఎలక్షన్లలో ఇతర పార్టీలను డిపాజిట్ దక్కకుండా చేసి మళ్లీ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ జెండా రెపరెపలాడబోతుందని ధీమావ్యక్తం చేశారు. ఇతర పార్టీల నాయకులు ప్రగల్బాలు పలుకుతున్నారు తప్ప వారి పార్టీ నుండి గాని, కేంద్ర ప్రభుత్వం నుండి గాని ఏ ఒక్క రూపాయి కూడా ఏ ఒక్క గ్రామానికి ఇంతవరకు రాలేదని తెలిపారు. వారికి రాబోయే ఎలక్షన్లలో బీఆర్ఎస్ పార్టీ జెండా బుద్ధి చెప్పబోతోందని జగన్ భరోసా ఇచ్చారు.

మామిడి రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్
- నాగపూర్‌లో మామిడి తోటలు, ఏర్గట్లలో పంటలు పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఏర్గట్ల
ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం తరుపున నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మండలంలోని నాగపూర్ గ్రామంలో రెండు రోజుల క్రితం గాలివానకు దెబ్బతిన్న మామిడి తోటలను భీమ్‌గల్ ఏడిఏ మల్లయ్యతో కలిసి గురువారం పరిశీలించారు. ఈదురు గాలులతో మామిడి కాయలు నేలరాలి పంటనష్టం జరిగిన తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుండి నష్టపరిహారం ఇప్పించి తనకు న్యాయం చేయాలని మామిడి రైతులు కోరారు. మామిడి తోటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు అభిప్రాయపడ్డ ఆయన మామిడి రైతులకు ప్రభుత్వం తరుపున నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని రైతులకు భరోసా ఇచ్చారు. నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యురాలు దుబ్బాక సుప్రియ, మండల వ్యవసాయ అధికారిని లావణ్య, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమేష్, రైతులు ఉన్నారు.


కమ్మర్‌పల్లి: రాలిన మామిడి కాయలు పరిశీలిస్తున్న అధికారి


ఏర్గట్ల: పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఏర్గట్ల: మండలకేంద్రంలో వర్షాలు, ఈదురుగాలుల వల్ల రైతులు నష్టపోయిన,నేల కొరిగిన పంటలను జిల్లా వ్యవసాయాధి కారి రాయుడు తిరుమల ప్రసాద్ పరిశీలించారు. నష్టపోయిన పంటల వివరాలను ఏఈఓలు సేకరించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సింగ్ దాస్,భీంగల్ డివిజన్ వ్యవసాయాధికారి కె.మల్లయ్య, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్, రైతుబంధు సమితి మండలాధ్యక్షులు సున్నపు అంజయ్య, ఏఓ అబ్దుల్ మాలిక్, తహసీల్దార్ జనార్దన్, ఏఈఓలు, ఏర్గట్ల పీఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, రైతు బంధు గ్రామశాఖ అధ్యక్షులు బద్దం ప్రభాకర్, ఉద్యాన శాఖ అధికారి రోహిత్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు రూ.50వేల పరిహారం చెల్లించాలి

సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్
పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృత సమావేశంలో నాయకులు వెల్లడించారు. ఈసందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారాన్ని ఎకరానికి 50వేల చొప్పున చెల్లించాలని, ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా మద్దతు ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని అన్నారు. అకాల వర్షాల మూలంగా నోటి కాడికి వచ్చిన ముద్ద జారిపోయి రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. జిల్లాలో వరి, మొక్కజొన్న, కంది, సోయా తదితర పంటలు తీవ్రంగా నష్టపోయాయని. అధికారులు చేస్తున్న సర్వేలు తమ వరకు వస్తలేవని రైతులు ఆవేదన చెందుతున్నట్లు తెలిపారు. కల్లాలలో పోసిన ధాన్యం సకాలంలో కొనుగోలుచేసి తీసుకువెళ్లకపోవడంతో ధాన్యం కుప్పలు తడిసి వర్షాలకు కొట్టుకుపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం తాత్సారం చేయకుండా నష్టపరిహారాన్ని చెల్లించాలని, సొసైటీలలో బ్యాంకుల్లో చేసిన అప్పులను రద్దు చేయాలని, కొత్తగా రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఈ ప్రభుత్వం చెప్పే మాటలకు చేసేదానికి పొంతన లేకుండా పోతుందని అన్నారు. ఫలితంగా రైతుల విశ్వాసం ప్రభుత్వం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట రాములు పల్లపు వెంకటేష్, నూర్జహాన్, ఎం గోవర్దన్, జిల్లా కమిటీ సభ్యులు వై గంగాధర్, నాయక్ వాడి శ్రీనివాస్, కొండ గంగాధర్, పి.నూరి, నన్నే సాబ్, రవి, నాగరాజ్, మహేష్, నర్సయ్య, అనసూయ, గంగాధర్, ఎండి ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

రోడ్డు, డ్రయినేజీలు బాగుచేసేవారు లేరు

- బాజిరెడ్డి జగన్ ఎదుట వాపోయిన బోర్గం గ్రామస్తులు
- కాలనీలను పరిశీలించిన జగన్

నవతెలంగాణ మోపాల్
మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బొర్గం గ్రామంలోగల వివిధ కాలనీలో ప్రణాళిక సంఘం సభ్యుడు, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బాజిరెడ్డి జగన్ గురువారం పర్యటించారు తొలిసారిగా తమ కాలనీకి వచ్చినందుకు భార్య నగర్ కాలనీలో ఆయన సన్మానించడం జరిగింది వారి సమస్యలను తెలుపుతూ నివేదికనిచ్చారు. కొందరు మహిళలు జగన్ ముందు తమ బాధను వెలబుచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడి ఐదు సంవత్సరాలు కావస్తున్నా కనీసం రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ కూడా బాగుచేసే వారు లేరని అన్నారు. ఎన్నిసార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కార్పొరేటర్‌కు విన్నవించినా కూడా తమకి ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ఈసందర్భంగా బాజిరెడ్డి జగన్ మాట్లాడుతూ ఎమ్మెల్యేతో మాట్లాడి స్పెషల్ ఫండ్ తీసుకొచ్చి కాలనీ అభివృద్ధి పరుస్తానని, ఇక్కడ ఉండే డ్రైనేజీ సమస్యను, రోడ్ల సమస్యను తీరుస్తానని కాలనీవాసులకు ఆయన భరోసా ఇచ్చారు. కాలనీకి నిరంతరం వస్తుంటాన్ని కాలనీవాసులతో రెగ్యులర్ టచ్ లో ఉంటానని ఏసమస్య ఉన్నా తెలియజేయాలని అన్నారు. వెంటనే ఎమ్మెల్యే, స్థానిక అధికారులతో మాట్లాడి మీ సమస్య తీరుస్తానని ఆయన తెలిపారు. తొలిసారి కాలనీకి వచ్చినందుకు వారు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న రామాలయంలో జగన్ పూజలు నిర్వహించారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో కెసిఆర్ సేవాదళ్ అధ్యక్షుడు కొరవే దేవేందర్, అన్నం సాయిలు, బోర్గం సొసైటీ చైర్మన్ ఎన్డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.


బాజిరెడ్డి జగన్‌కు సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలి

● మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

ఈదురు గాలులు వడగండ్ల వాన కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం తక్షణమే అందించాలని ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు ఏనుగు రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ముస్తాపూర్, ఎల్లారం, బురిగిద్ద, మేంగారం, భవానీపేట్ గ్రామాలలో వడగండ్ల వానతో నష్టపోయిన వరి పంటలను క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.25వేలు నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంజరి ఎల్లమయ్య, చేపూరి వంశీ, మాజీ సర్పంచ్ అప్రోచ్, కమ్మరి పాండరి, కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ సంజీవులు, కోఆప్షన్ నెంబర్ శ్రీనివాస్, దాసరి అనిల్, మార్గం సాయిలు, సురేష్, వార్డు మెంబర్ రమేష్, సీనియర్ నాయకులు కిషన్, నారాయణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-కోటగిరి

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశిస్తూ సీపీఐ మండల కార్యదర్శి ఏ విటల్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలు వడగాలుల వలన రైతులకు కన్నీళ్లు మిగిలాయని, గాలులు వడగాళ్ల వర్షాలతో కోతకు వచ్చిన వరి పొలంలోనే వడ్లు నేలరాలిపోయాయని దీనివలన రైతులు బాగా నష్టపోయారని తడిసిన వడ్లను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దారుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నల్ల గంగాధర్, రాజు, బుడాల రాములు, గంగాధర్, మారుతి, ఈశ్వర్, గంగారం తదితరులు పాల్గొన్నారు.

జొన్నల మిషన్‌పై నుంచి పడి గిరిజన మహిళ కూలి మృతి

● మరో ఇద్దరికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-పిట్లం

జొన్నల మిషన్‌పై నుంచి కిందపడి ఓ గిరిజన మహిళ మృతిచెందగా మరో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలైన ఘటన సిద్దాపూర్ తాండ శివారులో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై విజయ్ కొండ కథనం మేరకు బుధవారం రాత్రి ఏడు గంటలకు నిజాంసాగర్ మండలం మల్లూరు తాండకు చెందిన షానుబాయ్ (40) మండలంలోని సిద్దాపూర్ తండాలో జొన్నలు పట్టి తిరిగి వెళుతుండగా మార్గమధ్యలో తండా శివారులోని పీర్‌సింగ్ భాయ్ దగ్గర జొన్నల మిషన్ ట్రాక్టర్‌ను డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో జొన్నల మిషన్‌పై కూర్చున్న షానుబాయి మరో ఇద్దరు కూలీలు కిందపడగా వారిపై జొన్నల మిషన్ పడడంతో షానుబాయ్ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు కావడంతో వారిని బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త హరిచంద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతురాలికి ఒక కూతురు, ఇద్దరు కుమారులున్నారు.

వాయిదా ప్రకారం కోర్టుకు హాజరు కాని వ్యక్తి రిమాండ్

నవతెలంగాణ-గాంధారి

వాయిదా ప్రకారం కోర్టుకు హాజరు కాని వ్యక్తిని కోర్టు ఆదేశాల మేరకు డిమాండ్‌కు తరలించినట్టు గాంధారి ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. గాంధారి మండల కేంద్రానికి చెందిన ఓడుసుల సందీప్(25) అనే వ్యక్తిపై 2017లో కొట్టుకున్న విషయంలో కేసు నమోదు కాగా అప్పటి ఎస్సై కోర్టులో చార్జి సీటు దాఖలు చేశారు. కాగా వాయిదా ప్రకారం కోర్టుకు హాజరు కావలసిన వ్యక్తి హాజరు కాకపోవడంతో ఎల్లారెడ్డి కోర్టు మేజిస్ట్రేట్ నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేశారు. ఆ వారెంట్‌ను తీసుకొని మండల కేంద్రంలో నేరస్తుని ఇంటికి వెళ్ళి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మంభోజిపేట గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో విద్యుత్తు జూనియర్ లైన్‌మెన్ బ్యాగరి దేవయ్య స్తంభం ఎక్కి విద్యుత్ వైర్లు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో కిందపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు.

ఇరుముడితో తరలివెళ్లిన బ్రహ్మంగారి మాలదారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూరు గ్రామానికి చెందిన ఐదుగురు బ్రహ్మంగారి మాల ధరించిన స్వాములు గురువారం మాలవిరమణ కోసం కడప జిల్లాలోని కందిమల్లయ్యపల్లి బయలుదేరి వెళ్లారు.

వరి ధాన్యాన్ని పరిశీలించిన మార్కెట్ కమిటీ చైర్మన్

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని పలు గ్రామాలలో ఆరబెట్టిన వారి ధాన్యంను కోటగిరి మర్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హమీద్ గురువారం పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు చేయడానికి వేగవంతం చేశామని రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తామని పేర్కొన్నారు. వారి వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాకల లక్ష్మణ్ రైతులున్నారు.

చిన్నగుల్లాలో అంబేద్కర్ జయంతి వారోత్సవాలు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని చిన్నగుల్లాలో అంబేద్కర్ యువజన సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో జయంతి వారోత్సావాలలో భాగంగా గురువారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను సర్పంచ్ శోభ చేతుల మీదుగా నిర్వహించినట్టు జేపీఎస్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు, గ్రామపెద్దలు, బీఆర్‌ఎస్ నాయకుడు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుల్ల నైట్ హాల్ట్ బస్సు ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్

పెద్దగుల్ల నైట్‌హాల్ట్ బస్సును గురువారం నుంచి పున:ప్రారంభం కానుందని జుక్కల్ బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మాదారావ్ దేశాయి తెలిపారు. ఈ సందర్భంగా దేశాయి మాట్లాడుతూ.. బాన్సువాడ డిపోకు చెందిన గుల్లా నైట్‌హాల్ట్ బస్సు గత కొన్ని నెలలుగా రోడ్డు బాగా లేదనే నెపంతో సర్వీస్ నడపకపోవడంతో మాదారావ్ దేశాయి డిపోమేనేజర్ కలిసి సమస్యలను డీఎంకు వివరించారు. పదిగ్రామాల ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని, నైట్‌హాల్ట్ బస్సు ప్రారంభించాలని పలుమార్లు విన్నపాలు చేసినందుకు డిపో మేనేజర్ సదానందం గురువారం నుంచి సర్వీస్ ప్రారంభిస్తామని తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి


నవతెలంగాణ-ఎడపల్లి

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మల గంగాధర్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ నారాయణకు వినతి పత్రాన్ని సమర్పించారు. సుదర్శన్, హనుమాన్లు, శ్రీపతి మల్లేష్, రంజల్ పోశెట్టి, రవి తదితరులు పాల్గొన్నారు.

గాంధారి పీఏసీఎస్ చైర్మన్ సాయికుమార్ సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి పీఏసీఎస్ చైర్మన్, ఎన్‌డీసీసీబీ అండ్ ఐడీసీఎంఎస్ డైరెక్టర్ నిజామాబాద్, పెద్దబూరి సాయికుమార్, దళిత రత్న అవార్డు వచ్చిన సందర్భంగా సాయికుమార్‌ను తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మార్కంటి బుచ్చన్న, తాడ్వాయి సొసైటీ చైర్మన్, నల్లవెల్లి కపిల్‌రెడ్డి, గాంధారి సర్పంచ్ ఫోరం మండలాధ్యక్షుడు గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్‌లు సన్మానించారు.



సన్మానిస్తున్న నాయకులు

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

● పలువురు ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దని పలువురు సొసైటీ చైర్మెన్లు, ప్రజాప్రతినిధులు అన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మెన్లు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

పిట్లం : ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దని చిల్లర్గి సొసైటీ వైస్ చైర్మన్ పుట్టి రాములు అన్నారు. మండలంలోని చిల్లర్గి విండో పరిధిలోని బండాపల్లి సబ్‌సెంటర్‌లోని కోమటి చెరువు తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వం సూచించిన గిట్టుబాటు ధరను లబ్ది పొందాలని సూచించారు. ధాన్యంలో తేమశాతం పొల్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తండా సర్పంచ్ దేవురావు, సొసైటీ డైరెక్టర్ శ్రీరామ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాట్రోత్ రవీందర్ నాయక్, సీఈఓ సంతోష్‌రెడ్డి, బండాపల్లి, కోమటి చెరువు తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రోతు సవాయిసింగ్, గుంటి రాములు, తాండ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు..

భిక్కనూర్ : దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఎంపీపీ గాల్ రెడ్డి తెలిపారు. మండలంలోని అంతంపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భగవంతు రెడ్డి, ఎఎంసీ వైస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మధుమోహన్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి, సిద్ధ రామేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, సీఈఓ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డితో కలిసి ఎంపీపీ గాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలోస్థానిక సర్పంచ్ సుమలత, సొసైటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి, సిద్ధ రామేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, సీఈఓ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డితో కలిసి ఎంపీపీ గాల్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భగవంతు రెడ్డి, ఎఎంసీ వైస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, స్థానిక సర్పంచ్ స్వామి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు సాయిరెడ్డి, సీఈఓ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వరి ధాన్యం రైతులు ఆందోళన చెందవద్దని రామేశ్వర్‌పల్లి సొసైటీ చైర్మన్ భూంరెడ్డి తెలిపారు. మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ గాల్‌రెడ్డి ప్రారంభించారు.



పిట్లం : అంతంపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



పిట్లంలో..

పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దు..

పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మోటాట్‌పల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ రాజేశ్వరి రాజిరెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర అందజేస్తుందని, అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో నష్ట పరిహారం అందజేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు సాయిరెడ్డి, సీఈఓ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని రెండు సెంటర్లలో వరి కొనుగోలు కేంద్రాన్ని విండో చైర్మెన్ నాగలగిద్దే శివానంద్ ప్రారంభించినట్టు సీవో బాబురావ్ తెలిపారు. ఈ సందర్భంగా విండో చైర్మెన్ శివానంద్ మాట్లాడుతూ.. మహమ్మదాబాద్, ఖండేబల్లూర్ సెంటర్‌లలో ఆయా గ్రామాల సర్పంచులు సాయులు, మహనంద ప్రారంభించారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు సాయిలు, మహనంద, ఉపసర్పంచ్ వీరేశం, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నీలుపటేల్, సాయాగౌడ్, జాదవ్ రాజు, శివరాజ్ దేశాయి, ప్రేమ్‌సింగ్, ఏవో నవీన్‌కుమార్, ఏఈవో సాయిసుమన్, విజయ, సీఈవో బాబురావ్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద : మండలంలోని ఫత్లాపూర్, మెక్కా గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతు సేవా సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలజీ ప్రారంభించారు. అనంతరం అధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ రైతులు పండించిన ఆఖరి ధాన్యం వరకు తాము కొంటామని రైతులు ఎలాంటి దిగులు పడవద్దు అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర క్వింటాకు ఏ గ్రేడ్ రకం రూ.2060, బీ గ్రేడ్ రకం రూ.2040 ధరకు కొనుగోలు చేస్తామని, రైతులు కొనుగోలు కేంద్రానికి వరి ధాన్యాన్ని తీసుకు వచ్చేటప్పుడు 17 శాతం లోపల తేమ ఉన్న ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ్ కుమార్, రైతు సహకార సంఘం ఉపాధ్యక్షులు యాదవ్ రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షులు బసవరాజ్ పటేల్, వ్యవసాయ అధికారి పోచయ్య, సెక్రెటరీ శ్రావణ్ కుమార్, సచిన్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని మీసాన్‌పల్లి, తిమ్మాపూర్, సోమర్యాఘడ్ తండాలో ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు మాట్లాడుతూ.. రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్స్ సూర్యప్రకాష్, లక్ష్మణ్, సర్పంచులు మామిడి దామోదర్, రవి, అగ్రికల్చర్ ఏఈఓ ముఖీద్, సతీష్, రైతులు సొసైటీ సీఈఓ విశ్వనాథం, సత్యనారాయణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : మండలంలోని కరక్‌వాడి గ్రామంలో వరి కోనుగోలు కేంద్రాన్ని ఉప సర్పంచ్ సౌందర్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఎల్‌పీఓ సురేందర్, గ్రామసంఘం అధ్యక్షురాలు శ్యామల, సీసీ భూమయ్య, గ్రామ సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని మోషన్‌పూర్, రంగంపేట్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి, స్థానిక ఎంపీపీ దశరథ్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు వరి ధాన్యాన్ని విక్రయించి లబ్ది పొందాలని సూచించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, సర్పంచులు మంజుల కిషన్ గౌడ్, శ్యామా గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, రైతుబంధు జిల్లా డైరెక్టర్ రాజేందర్, ఎంపీటీసీ ఉమాదేవి, డైరెక్టర్లు లక్ష్మాగౌడ్, ప్రవీణ్‌రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కూచంపల్లి దేవేందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని రాంపూర్, జల్దిపల్లి, భవానీపేట్, అయ్యపల్లి, శెట్టిపల్లి తండా, శెట్టిపల్లి, పరమళ్ళ గ్రామాల్లో ఆయా సర్పంచుల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు తెలిపారు.

వీవోఏలకు వేతనాలు పెంచాలి..

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని వీవోఏలు ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఐకేపీ కార్యాలయం నుంచి ప్లకార్డులతో ర్యాలీగా వెళ్లి మహాత్మాగాంధీ విగ్రహానికి, డా.అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీవోఏల మండల అధ్యక్షులు ఉమాకాంత్, ఉపాధ్యక్షులు నిర్మల, కార్యదర్శి రఘుపతి, సహాయ కార్యదర్శి సంతోష్, కోశాధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

● లయన్స్ క్లబ్ ఆఫ్ జిల్లా కోశాధికారి కరటూరి సూర్యనారాయణ

నవతెలంగాణ-ఎడపల్లి/మద్నూర్

కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ జిల్లా కోశాధికారి కరటూరి సూర్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని జైతాపూర్ గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు వైద్యులతో పాటు ఆశావర్కర్లు, అంగన్వాడీ ఉపాధ్యాయులు స్థానిక గ్రామస్తులకు సేవ అందించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంటి వెలుగు డీఈఓ భారతి, వైద్యులు శ్రీకాంత్, ప్రశాంత్, ఆరోగ్య వైద్య సిబ్బంది మాధవి లత, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు వకుళాదేవి, ఆశావర్కర్లు స్వరూప తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైద్యబృందం

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

మద్నూర్ : కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ధర్మవ్వ అన్నారు. గురువారం డోంగ్లి మండలం మల్లాపూర్ గ్రామ పంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ కే.ధర్మవ్వ ప్రారంభించగా గ్రామ కార్యదర్శి పద్మావతి, మండల పంచాయతీ అధికారి వెంకట నరసయ్య బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వీరేశం, మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, కంటి వెలుగు ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించేవరకూ ఆందోళన

● ఒంటి కాలుపై నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం

మద్నూర్ : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేవరకూ ఆందళన చేస్తామని వీవోఏలు స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఐకేపీ వీవోఏలు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం మండల అధ్యక్షులు వీఎం చారి మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేవరకూ నిరవధిక సమ్మె రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఇలాగే కొనసాగిస్తామని, రోజురోజుకూ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ ఆందోళనలో వీవోఏల మండల కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తాం..

కామారెడ్డి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఐకేపీ వీవోఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఐకేపీ వీవోఏల నాలుగో రోజు నిరవధిక మెరుపు సమ్మెకు మాజీ మంత్రి షబ్బీర్ అలీ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మీ న్యాయమైన డిమాం డ్లను పరిష్కరించకపోతే పార్టీ అధికారంలో రాగానే మీ డిమాండ్లను కాంగ్రెస్ పరిష్కరిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఐకేపీ వీవోఏలకు నెల జీతం రూ.18 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. సమ్మెలో ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పఠాన్ గౌస్ ఖాన్, జిల్లా అధ్యక్షులు తాటిపాముల బాబాగౌడ్, సరితరెడ్డి, విక్రమ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్ : నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి: వీఏఓలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని మండలంలోని ఐకేపీ కార్యాలయం ముందు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు.

ఆదర్శవంతంగా మహిళా సంఘాలు

నవతెలంగాణ-దోమకొండ

మండలంలోని ఆయా గ్రామాలలోని వివిధ గ్రామ సంఘాలు, మహిళా సంఘాలను డీపీఎం సుధాకర్, కర్ణాటక, తమిళనాడు, పాండిచెర్రీ రాష్ట్రల నాబార్డ్ బృందం సభ్యులు గురువారం మహిళా సంఘాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దోమకొండ మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాలు తీసుకున్న రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారని, ఎన్ఐఆర్‌డీ ఆధ్వర్యంలో ఆరు రాష్ట్రాల ప్రతినిధుల బృందం సందర్శించారు. మండలంలోని మహిళా సంఘాల పనితీరును, స్వయం సహాయక సంఘాలు పనిచేస్తున్న తీరును పొదుపులు, ఖర్చులు, లాభనష్టాలు, మహిళా సమస్యల పరిష్కారం, వ్యాపార అభివృద్ధి తదితర విషయాల గురించి ఆ రాష్ట్రాల ప్రతినిధులు బృందం సభ్యులు తెలుసుకున్నారు.

సంఘాలు నిర్వహిస్తున్న పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పావలా వడ్డీపై రుణాలు ఇస్తుందని తెలిపారు. రుణాలతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, ఎంపీపీ శారదా, ఎన్ఐఆర్‌డీ మిషన్ మేనేజర్ వెంకటేశ్వర్ రావు, ఎగ్జిక్యూటివ్ అధికారులు రాజు, రవి నాయుడు అసిస్టెంట్, డీఆర్‌డీఓ మురళీకృష్ణ, ఐబీ డీపీఎం సుధాకర్, ఏపీఎం రాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి లలిత, లావణ్య వరలక్ష్మి, ఐకేపీ సీసీలు, వివిధ గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటుకు తీర్మానం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అంజలి పాలకవర్గం ఆధ్వర్యంలో దోమకొండలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని పాలకవర్గం సభ్యులు గురువారం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంజలి మాట్లాడుతూ దోమకొండ మండలంతో పాటు ఆయా మండలాల్లోని గ్రామ ప్రజలకు వైద్య పరంగా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే దోమకొండలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయాలని గ్రామ పాలక వర్గం సభ్యులు తీర్మానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డ్ సభ్యులు శ్రీనివాస్, వర లక్ష్మి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

విప్రో కంపెనీలో ఉద్యోగం సాధించిన ఉషోదయ విద్యార్థి

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని ఉషోదయ కళాశాలకు చెందిన అనిరుద్ పటేల్ బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి విప్రో కంపెనీ నిర్వహించిన ఆన్‌లైన్ ప్రాంగణ నియామకాలలో ఎంపికయ్యారు. దాంతో గురువారం విద్యార్థికి ఉషోదయ కళాశాల డైరెక్టర్ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విప్రో కంపెనీకి ఎంపికైన విద్యార్థికి కంపెనీ ఉచితంగా చదివిస్తూ ఉద్యోగ అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థికి మూడు లక్షల వార్షిక వేతనం కంపెనీ అందిస్తుందని అన్నారు. కార్పొరేట్ కంపెనీలలో ఎంపికైన విద్యార్థులకు కంపేనీలు చదువిస్తూ ఉద్యోగం కల్పిస్తారని దాంతో విద్యార్థి భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సూర్యప్రకాష్, ప్రిన్సిపాల్ గంగాధర్ ఉన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ దుష్యంత్

మహర్షి భగీరథ జయంతి వేడుకలు

నవతెలంగాణ-తాడ్వాయి

మహర్షి భగీరథ తపస్సు వల్ల ఆకాశం నుంచి గంగ భూమి పైకి వచ్చిందని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి భగీరథ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి భగీరథ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, సహాయ సంక్షేమ అధికారి యాదగిరి, వసతి గృహాల యూనియన్ అధ్యక్షుడు చక్రధర్, బీసీ సంఘాల నేతలు నాగరాజు, రాజయ్య, శివరాం, మోహన చారి, సుదర్శన్, వసతి గృహాల సంక్షేమ అధికారులు నరేష్, పవన్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మద్నూర్ : మండలంలోని హండేకేలూర్ గ్రామంలో సగర (ఉప్పర) కుల దైవం రాజ భగీరథ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, బీజేపీ మండల అధ్యక్షులు బి. హన్మాండ్లు, సర్పంచ్ నిలవతి తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవం కోసం సమావేశం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో గల శ్రీ లక్ష్మీ నారాయణ రథోత్సవం వచ్చే నెల 5వ తేదీన జరగనున్న నేపథ్యంలో గురువారం గ్రామపెద్దలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ బండివార్ విజయ్, చౌలవార్ హనుమాన్లు స్వామి, సొసైటీ మాజీ చైర్మన్ ఆలయ మాజీ చైర్మన్ పాకలవార్ విజయ్, బండివార్ లక్ష్మణ్, చాట్లా వార్ హనుమాన్లు, సక్కర్ల వార్ నరేష్, ఆవార్వార్ రాజు, కంచిన్వార్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం అంటే మూఢత్వం పెంచడమే

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సిబిఎస్‌ఈ పదో తరగతి పాఠ్యాంశాల నుండి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం అంటే విద్యలో మూఢత్వాన్ని పెంచడమేనని పీడీఎస్‌యూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ఒక ప్రకటన లో తెలిపారు. విద్యారంగంపై ఆర్‌ఎస్‌ఎస్ డైరెక్షన్‌లో బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తుందని విమర్శించారు. ఎన్సిఈఆర్టి ఇటీవల 10,11,12 తరగతికి చెందిన చరిత్ర రాజకీయశాస్త్రం పుస్తకాల నుంచి కొన్ని భాగాలను గాంధీహత్య, గుజరాత్ అల్లర్లు, ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం, డార్విన్ పరిణామ సిద్ధాంతం తొలగించారని పేర్కొన్నారు. ఎన్సిఈఆర్టీ తీరు దేశంలో సైన్స్ విద్యను దేశ భవిష్యత్తుకు గొడ్డలి పెట్టుగా మారిందని తెలిపారు. తొలగించిన పాఠ్యాంశాలను యథావిధిగా ఉంచాలని, దేశంలో విద్యను మూఢత్వంలోకి నెట్టి విద్యలో కాషాయీకరణను పెంచే ప్రయత్నాలను మానుకోవాలని పేర్కొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర శివారులోని సారంగాపూర్ బస్టాప్, హనుమాన్ గుడి వద్ద గురువారం తనిఖీలు చేసినట్టు డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ నిజామాబాద్ సీఐ మంగమ్మ తెలిపారు. గురువారం సాయంత్రం నిర్వహించిన తనిఖీలలో షేక్ అమీర్ 150 గ్రాముల గంజాయి తరలిస్తుండగా బైక్ తో సహా పట్టుకున్నామని చెప్పారు. రు. 150 గ్రాముల గంజాయి, ఒక బైక్, ఒక మొబైల్ ఫోన్ సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం నేరస్తుడిని అరెస్ట్‌చేసి ఎస్‌హెచ్‌ఓ నిజామాబాద్ కు అప్పజెప్పామని తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ సీఐ మంగమ్మ, సిబ్బంది సాగర్‌రావ్ (హెచ్సీ), కానిస్టేబుల్స్ కిరణ్ కుమార్, నర్సయ్య చారి, చంద్రమోహన్, గోపి, కార్తిక్ పాల్గొన్నారు.

ఒకే రోజు నాలుగు పరీక్షలు నిర్వహించడం సరికాదు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దాల నాగరాజు

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 30న ఒకే రోజు మూడు ఎగ్జామ్స్ నిర్వహించడం సరికాదని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉ.ధ్యక్షులు సిద్దాల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేరోజు నాలుగు ఎగ్జామ్స్ పెట్టడం వల్ల విద్యార్థులు నష్టపోతారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటి నుంచి ఉద్యోగ అవకాశాలు లేక బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులతో నెట్టుకొస్తు కాంపిటేట్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతున్నారని తెలిపారు. నిరుద్యోగ యువకులు ఏ నోటిఫికేషన్ ఇస్తే ఆ నోటిఫికేషన్ కి ప్రయత్నం చేస్తున్నారని, ఈ సందర్భంలో ఒకేరోజు నాలుగు ఎగ్జామ్స్ నిర్వహించడం అంటే ఏదో ఒక ఎగ్జామ్ మాత్రమే రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నాలుగు పరీక్షలు రాయాల్సిన అభ్యర్థులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రతి అభ్యర్థి నాలుగు ఎగ్జామ్స్ ఉపయోగించుకోవాలంటే నాలుగు వేరు వేరు పరీక్షలు పెడితే తప్ప అది సాధ్యం కాదని పేర్కొనారు. నిరుద్యోగులకి అన్ని ఎగ్జామ్స్ లో రాసే అవకాశం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలిపారు.

మహనీయుల ఆలోచనలతో ముందుకు సాగితేనే అభివృద్ధి

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్
- ఘనంగా భగీరథ మహర్షి జయంతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



నివాళ్లు అర్పిస్తున్న అదనపుకలెక్టర్, అధికారులు

భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఈ వేడుకలకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా, వివిధ శాఖల అధికారులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయుడయ్యారని కొనియాడారు. ఏదైనా కష్టమైన కార్యం సాధించాలంటే మహర్షి భగీరథుడి స్ఫూర్తితో ముందుకు సాగాల్సిందిగా పెద్దలు సూచిస్తారని గుర్తు చేశారు. మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం వారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. మహనీయులను స్మరించుకోవడం ద్వారా ప్రేరణ లభించి సమాజం సంస్కరించ బడుతుందనేదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా మహ నీయుల ఆలోచనా విధానాలతో ముందుకు సాగితే సమాజం సత్వర అభివృద్ధి సాధించేందుకు, రుగ్మతలు దూరం అయ్యేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. కార్య క్రమంలో బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి నర్సయ్య, బీసీ సంఘాల ప్రతినిధులు నరాల సుధాకర్, బుస్స ఆంజనేయులు, రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ల నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన జూనియర్ డాక్టర్ల నూతన కమిటీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు(జూడా) నూతన కార్యవర్గాన్ని గురువారం నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ది తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కౌశిక్, ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రణయ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా డాక్టర్ సురేష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూజిత, ఉపాధ్యక్షులుగా డాక్టర్ హరిత, కోశాధికారిగా డాక్టర్ రక్షిత, ఆర్గనైజింగ్ సెక్రటరిగా డాక్టర్ పవన్, జాయింట్ కార్యదర్శిగా జయంత్ సాత్విక్, డాక్టర్ సంపత్, డాక్టర్ సుర్జిత్‌ను నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లడుతూ జూడా హక్కులని రక్షించుకోవాలని తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధి రోగుల ఆరోగ్య సంరక్షణకోసం పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో పిజి, హౌస్ సర్జన్లు తదితరులు పాల్గొన్నారు.

తూతుమంత్రంగా పనులు చేస్తే కుదరదు

- ఎంపీడీవో వెంకటేశ్వర్లు



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-పిట్లం

ఉపాధిహామీలో తూతూ మంత్రంగా పనులు చేస్తే కుదరదని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని అన్నారం (కలాన్) గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీలో సమూల మార్పులు వచ్చాయని, తాజాగా శ్రమించే కూలీలకే ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. కష్టపడే తత్వం ఉన్నవారికి మేట్లు అవకాశం కల్పించాలని సూచించారు. ప్రభుత్వం కూలిని రూ.272కు పెంచిందని, పెంచిన మొత్తాన్ని కూలీలు దక్కించుకునేలా పనులు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఎం శివ, పంచాయతీ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ రూరల్ ఇంచార్జ్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-సిరికొండ

అకాలవర్షం, వడగండ్ల వానతో పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఎకరానికి 25 వేల రూపాయలు నష్టపరిహారం అందించి వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ రూరల్ ఇంచార్జ్, ఎక్స్ ఎమ్మెల్సీ, డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పెద్ద వాల్గోట్, కొండాపూర్ గ్రామాలలో ఆయన పర్యటించారు. నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతి అని చెప్పుకోవడమే తప్ప ఆపదలు సంభవించినప్పుడు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. బంగారు తెలంగాణ సాధించుకుని రైతులు నడివీధులలో అడుక్కుతినే పరిస్థితి తీసుకొచ్చాడని, రానున్న రోజుల్లో ప్రజలే బీఆర్ఎస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్తారని ఆయన తెలిపారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకి ఎకరానికి 25వేల రూపాయల నష్టపరిహారం వర్షాకాలం పంటకు సరిపడా ఉచిత ఎరువులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈయనవెంట నిజామాబాద్ జిల్లా అర్బన్ ఇన్చార్జి టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్ రెడ్డి, సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బకారం రవి, డిస్టిక్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులు గొల్ల ఎర్రన్న, భాస్కర్ రెడ్డి, చందర్ నాయక్, గాదరి నర్సారెడ్డి, సిరికొండ రమేష్ సిరికొండ, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆసిఫ్, రిక్క సామ్యుల్, సంతోష్ బాకారం తదితరులు పాల్గొన్నారు.

మనఊరు మనబడి పనుల పరిశీలన



మాట్లాడుతున్న సీఈవో గోవింద్ నాయక్

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని గడ్కోల్ గ్రామంలో గురువారం జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి గోవింద్ పంచాయతీ రికార్డులు, మనఊరు మనబడిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... గ్రామంలో 100 శాతం పన్నులు వసూలు చేయాలని, అదేవిధంగా మనఊరు మనబడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సీఈవోను నర్సారెడ్డి శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ లక్ష్మీప్రసాద్ స్థానిక సర్పంచ్ దేవగౌడ్, కరోబార్ సాయిలు సిబ్బంది ఉన్నారు.

నేడు ఎల్లారెడ్డిలో బగలాముఖి అమ్మవారి జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన జ్యోతిష పండితులు బగలాముఖి ఉపాసకులు శ్రీ క్రాంతి పటేల్ ఆధ్వర్యంలో శ్రీ బగలాముఖి అమ్మవారి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు బగలాముఖి అమ్మవారి మహాయాగం, అలాగే 11 గంటలకు సామూహిక కుంకుమార్చన, దాని తర్వాత అన్నప్రసాదం ఉంటుందని వివరించారు.

ఎకరానికి రూ.50 వేలు పరిహారం చెల్లించాలి

- మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి/డిచ్‌పల్లి



వరి పంటను పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి, నాయకులు

అకాల వడగండ్ల వర్షం ద్వారా పంటలు నష్ట పోయిన రైతాంగానికి ప్రభుత్వం వెంటనే ప్రతి ఎకరానికి 50 వేల నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, గురువారం అయన మండలంలోని మైలారం, చల్లగర్గ, దుబ్బాక గ్రామాల రైతుల పంట పొలాలను సందర్శించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ అకాల వడగండ్ల వర్షంతో రైతులు తీవ్ర నష్టపోయారని ప్రభుత్వం వీరిని తక్షణమే ఆదుకునేందుకు యుద్ధప్రాదిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనేక మంది రైతులు బతకడానికి పనులు లేక కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నారని, ఈవిపత్తు వల్ల వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయని అన్నారు.కంటి తుడుపు చర్యలు తీసుకోకుండా ప్రతి ఎకరానికి 50 వేలు అందించి ఆదుకోవాలని అన్నారు. సంబంధిత అధికారులు త్వరగా పంట నష్ట నివారణపై ప్రతి గుంటకు లెక్కలువేసి నివేదిక అందించాలని వ్యవసాయ, రెవెన్యూ, అధికారులకు కోరారు, కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, రూరల్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు తాహెర్‌బిన్ హందాన్, కాటిపల్లి నగేష్ రెడ్డి, లింగాపూర్ సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, అర్గుల పెద్ద బాల్‌రెడ్డి, రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి :డిచ్‌పల్లి మండలంలోని కొరట్‌పల్లి, సుద్దులం గ్రామాల్లో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, తోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ భూపతిరెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి పంట పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో పీసీసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హమ్‌దాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు, మాజీ బీసీ సెల్ అధ్యక్షులు శేఖర్ గౌడ్, రత్నాకర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కండ్లకు గంతలతో వివోఏల నిరసన



ఆర్మూర్: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న వీవోఏలు

నవతెలంగాణ- వేల్పూర్ (ఆర్మూర్)/కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో ఐకేపి ఆధ్వర్యంలో గురువారం నాలుగవ రోజు కండ్లకు గంతలు కట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల సమైక్య అధ్యక్షురాలు ఓసీమా మండల సమైక్య ఓబీలు అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాలు వీవోఏల సమ్మెకు మద్దతు పలికారు. మండలకేంద్రంలో దాదాపు 30 మంది వివో ఏలు 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న వారికి ప్రభుత్వం తరపునుంచి కనీస ఉద్యోగ గుర్తింపు లేకపోవడం, వేతనం జీతబత్యాలు పెంచకపోవడంతో నిరసన లికార్యక్రమం ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని అన్నారు. మండల ఐకేపీ, వీవోఏ అధ్యక్షురాలు కే లత ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పి మాణిక్ రావు, ఎస్ కవిత, బి అన్నపూర్ణ వివోఏలు పాల్గొని మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నామని, కనీసం నెలకు 18 వేల రూపాయల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివోఏల కార్యదర్శి ఎస్ కవిత, కోశాధికారి, డి కావ్య, సహ కార్యదర్శి పి మాణిక్ రావ్, ఉపాధ్యక్షులు పి మురళీమోహన్. ఎస్ కవిత, బి అన్నపూర్ణ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలం కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయ వద్ద కొద్దిరోజులుగా వివోఏలు సమ్మె చేస్తున్నారు. అందులో భాగంగా కండ్లకు గంతలతో ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా వివో ఏలు మాట్లాడుతూ తమకు కనీస గౌరవ వేతనం రూ. 18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు ఇవ్వాలని వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల ఐకేపీ వీఓఏల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సులో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ- ఆర్మూర్

హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో గురువారం జరిగిన రాష్ట్ర సదస్సులో పట్టణానికి చెందిన ఐ ఎఫ్ టి యు నాయకులు దాస్ పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల పర్మినెంట్ చేయాలని కనీసవేతనం 19వేలు ఇవ్వాలని, పిఎఫ్ ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని, రిటర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షలు ఇవ్వాలని, పండుగ సెలవులు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న 50వేల కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్‌చేస్తూ జేఏసీ రాష్ట్ర సదస్సు నిర్వహించారని తెలిపారు. సదస్సులో ఎమ్మెల్సీ నరసింహారెడ్డి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు, సిఐటియు కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏటీసీ రాష్ట్ర కార్యదర్శి యూసుఫ్, తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జఠంకి వెంకన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు నాగన్న, కుసుమంచి వెంకన్న, జేపీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్ సెక్షన్ భాస్కర్‌ను సస్పెండ్ చేయాలి

- జూనియర్ అసిస్టెంట్ మధులికను ట్రాన్స్‌ఫర్ చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అకౌంట్ సెక్షన్ భాస్కర్‌ను సస్పెండ్ చేయాలని, జూనియర్ అసిస్టెంట్ మధులికను వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం యూనివర్సిటీ అకౌంట్ కార్యాలయాన్ని యూనివర్సిటీ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ లక్షల రూపాయలు ఇచ్చి సూపరిండెంట్ నుంచి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి తెచ్చుకున్నాడని, యూనివర్సిటీకి సంబంధం లేని వ్యక్తులకు ఇష్టం వచ్చిన రీతిలో లక్షల రూపాయల చెక్కులు రాశాడని వారన్నారు. అకౌంట్ సెక్షన్‌లో దాదాపు పది సంవత్సరాల నుండి పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ మధులికను ట్రాన్స్ ఫర్ చేయాలని, ఆమె పైన విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి కి వినతిపత్రం అందజేశారు. చర్యలు తీసుకోకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని, ఆయనను యూనివర్సిటీలో రానీయ కుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, శివ, విఠల్, సురేష్, జయంతి, కవిత, శివ, సాయి కృష్ణ, సాయిబాబు, ఆకాష్, అశ్విత్, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపనకు నగదు విరాళం అందజేత

నవతెలంగాణ-దోమకొండ

బీబీపేట్ మండలంలోని మాందాపూర్ గ్రామంలో మే నెలలో 6,7,8,9 తేదీల్లో జరగనున్న ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన, కళ్యాణం వేడుకలకు ముఖ్య అతిథిగా బీబీజీ గ్రూప్స్ డైరెక్టర్, ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎం.పెరమాండ్లు హాజరు కావాలని గౌడ సంఘం ప్రతినిధులు నాగరాజ్‌గౌడ్ ఆహ్వాన పత్రికను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరగా ధ్వజస్తంభం ప్రతిష్టాపనకు అయ్యే పూర్తి రూ.1,50,000 నగదు సహాయం అందజేశారు. కార్యక్రమంలో వెంకట్ స్వామీగౌడ్, నర్సాగౌడ్, రామాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, సందీప్ గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షకీల్ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఏక చక్రేశ్వర శివాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అఖండ శివనామ సప్త కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు సప్తహ చివరి రోజు గురువారం బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ శివాలయంలో భక్తులకు మహా అన్నదనం కార్యక్రమం నిర్వహించారు. అఖండ శివనామ సప్త కార్యక్రమం పాల్గొన్న భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించి, మహారాజ్ ప్రవచనాలను ఆలకించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయి, శివాలయం చైర్మెన్ బీర్కూర్ శంకర్, పురాణే అజయ్ కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులోపడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-రాజంపేట్



మండలంలోని తలమడ్ల గ్రామానికి చెందిన బోయిని చంద్రం బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో కలిసి చేపల వేటకు చంద్రం వెళ్లగా ప్రమాదవశాత్తు బోయిన చంద్రం (38) అనే వ్యక్తి నీటిలో మునిగి చనిపోయాడు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆ విషయాన్ని రాత్రి చెప్పకుండా ఉదయం 10 గంటల సమయంలో గ్రామస్తులకు తెలియజేయడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడతామని, ఇంకా వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ రాజు పేర్కొన్నారు.

వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో విద్యార్థులకు వేసవి సెలవులలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సరెడ్డి తెలిపారు. సెలవులలో విద్యార్థులు సమయం వృదా చేయకుండా, ఒత్తిడికి లోనవ్వకుండా, సెల్, ట్యాబ్‌లకు పరిమితం కాకుండా ఉండేందుకు ఐదు సంవత్సరాల నుండి 12 సంవత్సరాలు కలిగిన విద్యార్థిని, విద్యార్థులకు మే 1 నుండి 25 వరకు సంస్కార సాధన తరగతులు (సూర్య నమస్కారాలు, యోగ, పౌరణిక, నీతి కథలు, భగవద్గీత శ్లోకాలు, సరస్వతి మాత ప్రార్థనలు, ఆర్ట్స్, క్రాఫ్ట్‌పై) నిర్వహిస్తున్నామని కనుక వీటిని సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు నర్సారెడ్డి సూచించారు. ఇందుకు 250 రుసుం పాఠశాలలో చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

- బీజేకేఎం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్

అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం, కొనుగోలు కేంద్రాల్లో తరుగు తీయడంలో రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిరసనగా భారతీయ జనతా కిసాన్ మోర్చా (బిజెకేయం) పట్టణ శాఖ అధ్యక్షులు శేషగిరి లింగం ఆధ్వర్యంలో గురువారం పట్టణ తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తహసిల్దార్ వేణు గోపాల్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ నాయకులు ఆలూరు విజయభారతి రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు నూతుల శ్రీనివాస్ రెడ్డి, కిసాన్ మోర్చ పట్టణ అధ్యక్షులు శేషగిరి లింగం మాట్లాడుతూ.....వర్షాల కారణంగా పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయని, అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిందని అన్నారు. ఒకవైపు కొనుగోలు కేంద్రాలు పూర్తిగా ప్రారంభించకపోవడం, మరోవైపు కాంటాలు సరిగా జరగకపోవడం వల్ల కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధాన్యం కుప్పలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి, నువ్వులు, కూరగాయల పంటలకు క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేయించి రైతులకు నష్టపరహారాన్ని అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాలు రైస్ మిల్లర్ల కనుసన్నల్లో కొనసాగుతున్నాయని, తరుగు దందాకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టం జరిగి రైతులు ఇబ్బందులు పడుతుంటే ఆర్మూర్ ఎంఎల్ఏ జీవన్ రెడ్డి రైతులను కలిసి పరామర్శించకపోవడం విడ్డూరంగా ఉందని. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యాగ సరీన్, బీజేపీ సీనియర్ నాయకులు బొట్ల విజయ్, కర్తన్ మధు, బాండ్లపల్లి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి పులి యుగంధర్, పట్టణ ఉపాధ్యక్షులు భవాని నవీన్, కిసాన్ మోర్చ పట్టణ ప్రధాన కార్యదర్శి దొడ్లే నారాయణ, ఉపాధ్యక్షులు చిట్టి భాజన్న,ఈరేటి నవీన్, బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షులు సాయినాథ్ రెడ్డి, కార్యదర్శి రెడ్డి బోయిన దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

మేడే గోడప్రతుల ఆవిష్కరణ

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రంలో ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో గురువారం 138 వ మేడే గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకుడు రాజేశ్వర్ మాట్లాడుతు కార్మికులకు కనీస వేతనాల పెంపుదలపై సామాజిక భద్రతకై పనిగంటల తగ్గింపుకై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అరవింద్, లక్ష్మణ్, అశోక్, సయ్యద్, రాజు, భావన్న కిషన్, సలీం, లింబాద్రి తదితరులు ఉన్నారు

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రానికి చెందిన రామాగౌడ్ కుటుంబ సభ్యులను బిజెపి జిల్లా నాయకుడు మల్లికార్జున్ రెడ్డి గురువారం పరామర్శించారు. రామాగౌడ్ తల్లి ఇటీవలే మృతి చెందడంతో మల్లికార్జున్‌రెడ్డి వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈయన వెంట నాయకులు మహిపాల్, చిన్ని నర్సయ్య, ప్రవీన్, యోగేశ్వర నర్సయ్య, సంగ్యానాయక్, ప్రసాద్,బాబురావ్ తదితరులున్నారు.

పద్మశాలీ సంఘం సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పద్మశాలి మండల సంఘం అధ్యక్షుడు శ్రీపతి శేఖర్ గురువారం తెలిపారు. కార్యక్రమంలో రూరల్ మాజీ అధ్యక్షులు జగదీష్, నాగభూషణం, ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.